క్లుప్తంగా

చిరుధాన్యాలపై అవగాహన



చెన్నారావుపేట : మండలంలోని ఈర్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మేడి సరోజన మాట్లాడుతూ.. చిరు ధాన్యాలలో అన్ని పోషక పదార్థాలు ఉన్నాయని తెలిపారు. చిరు ధాన్యాలు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని, రుచికరమైన భోజనం తయారు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పవనకుమారి, మౌనిక, లావణ్య, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రాయపర్తి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు కోరారు. మంగళవారం మండలంలోని పెర్కవేడు అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వైట్ల త్రివేణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చాపలబండలో వైద్యశిబిరం



దుగ్గొండి : మండలంలోని చాపలబండలో దుగ్గొండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 121 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌రాజు మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. డాక్టర్ భరత్‌కుమార్, సర్పంచ్ ఎడెల్లి రజిత, ఎంపీటీసీ పిండి కుమారస్వామి, హెచ్‌ఈఓ సాంబయ్య, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలికి చెందిన ఐలోని నాగరాజు ఐదేళ్ల క్రితం కరీంనగర్ జిల్లా జమ్మికుంట వద్ద బస్సులో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగి మృతి చెందాడు. గతంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటికి పరిహారం అందలేదని, సాయం చేసి ఆదుకోవాలని మంగళవారం హైదరాబాద్‌లో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్‌ను కలిసి మృతుడి సోదరుడు ఐలోని అభిషేక్, బీఆర్‌ఎస్ నాయకులు జోరిక రమేశ్, రాంమూర్తి, వెంకన్న, నాగరాజులు వినతిపత్రం సమర్పించారు.

దోమల మందు పిచికారీ

ఖానాపురం : మండల కేంద్రంలోని ఐదోవార్డులో దోమల మందు పిచికారీ చేయాలని వార్డు మెంబర్ అశ్విని ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి వినిపించుకోకపోవడంతో వార్డు మెంబర్ భర్త రాజశేఖర్ మంగళవారం స్వయంగా వార్డులో దోమల మందు పిచికారీ చేశారు. దీంతో రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.

విజయవంతం చేయాలి

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నేడు(బుధవారం) వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణవరదరాజేశ్వర్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే వరంగల్ పార్లమెంటు నియోజకవర్గాల సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అబ్బాపూరి వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పెద్ది స్వప్న జన్మదిన వేడుకలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట సర్వాపురం గ్రామ ఎస్సీ కాలనీలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఏర్పాటుచేసిన కేక్‌ను నాల్గోవ వార్డు కౌన్సిలర్ శీలం రాంబాబు కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

నెక్కొండ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం జరిగింది. ఎస్సై జానీపాషా తెలిపిన వివరాలు.. ఈ నెల 11న రాత్రి నవతా ట్రాన్స్‌పోర్ట్ వాహనం బోల్తా పడిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన బానోత్ శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందారు. అతి వేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదం జరిగిందని మృతుడి భార్య నీల ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు లేవ్..

- వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు నిలయంగా మారుతున్న జాతీయ రహదారి
- సర్వాపురం శివారులో నిత్యం ప్రమాదాలు

నర్సంపేట రూరల్ : పేరుకే జాతీయ రహదారి.. కానీ స్పీడ్ లిమిట్ తగ్గించేందుకు ఎక్కడ కూడా స్పీడ్ బ్రేకర్లు లేవు.. దీంతో ప్రతీ రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి.. పట్టణంలోని సర్వాపురం గ్రామ శివారులో ఎంజేఆర్ రైస్ మిల్లు సమీపంలో నర్సంపేట–మహబూబాబాద్ 365 జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురికి గాయాలై మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. గతంలో అనేక చోట్ల జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ స్పీడ్ లిమిట్ మాత్రం తగ్గడంలేదు. అతి వేగమే ప్రమాదాలకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామ శివారులోని నాగమ్మ గుడి క్రాస్ నుంచి ఖానాపురం బ్రిడ్జి వరకు 365 జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆరోడ్డు పక్కనే మూడు రైస్‌మిల్లులు ఉన్నాయి. నిత్యం ఆ ప్రాంతంలో జనాలతో రద్దీగా ఉంటుంది, పలు



జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ (ఫైల్)

వాహనాలు, లారీలు సైతం అక్కడే ఆగుతూ ఉంటాయి. అయితే బ్రిడ్జి సమీపంలో గతంలో మూడు పాయింట్ల వద్ద మూల మలుపులు ఉండడంతో ప్రమాదాలు జరిగేవి.. కానీ జాతీయ రహదారి అధికారులు ఆ మూడు చోట్ల ఉన్న మలుపులను తొలగించి నేరుగా రోడ్డు ఏర్పాటుచేయడంతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డంతా ఎలాంటి మలుపు లేకుండా ఉంది. దీంతో వాహనదారులు పరిమితికి మించి స్పీడ్‌తో వచ్చి వాహనాలు అదుపుకాక కింద పడడంతో గాయాలపాలవుతున్నారు.

వరుస ప్రమాదాలు..

గత నెలలో ఓ లారీ మల్లంపల్లి నుంచి కాకినాడకు వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంతో ఎడమ వైపు నుంచి కుడివైపు ప్లాట్లకు దూసుకొచ్చి అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ నెల 7వ తేదీన ఓ ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు పెద్దమ్మగడ్డ వైపు వెళ్తుండగా మిల్లుల వైపు వెళ్తున్న వాహనాన్ని క్రాస్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆ వాహనాన్ని ఢీకొట్టడంతో ముగ్గురు కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి సంఘటనలు ఈప్రాంతంలో ఎక్కువ జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెండు కిలోమీటర్ల మేర ఈ రోడ్డుపై పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తేనే ప్రమాదాలు కొంత మేర నివారించవచ్చని వాహనాదారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, జాతీయ రహదారుల అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

దశాబ్దాల కల నెరవేరింది..

జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్

దుగ్గొండి : గిర్నిబావి నుంచి దుగ్గొండి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు కావాలనే దశాబ్దాల కల నేడు సాకారమయిందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. గిర్నిబావిలో డబుల్ లేన్ బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎనిమిది కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. ఎమ్మెల్యే కోరిక మేరకు పనులు దక్కించుకున్న కేపీఆర్ కన్‌స్ట్రక్షన్ 100 రోజుల్లో బీటీ రోడ్డు పనులు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన నాయకులు పనులు దక్కించుకుని, చేయక పోవడం వల్ల నిధులు మురిగిపోయాయని గుర్తు చేశారు. గిర్నిబావి నుంచి నల్లబెల్లి వరకు రూ.30 కోట్ల నిధుల వ్యయంతో బీటీ రోడ్డు మంజూరు చేసి పూర్తి చేయించి రెండు



గిర్నిబావి-దుగ్గొండి బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆకుల శ్రీనివాస్ తదితరులు

మండలాలను అనుసంధానించిన ఎమ్మెల్యే పెద్దికి ప్రజలు అండగా నిలవాలన్నారు. పనిచేసే నాయకుడికి పట్టం కడితే అభివృద్ధి ఫలాలు ఎలా ఉంటాయో చాలా ఏళ్ల తర్వాత నర్సంపేటలో కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సుకినె రాజేశ్వర్‌రావు, కాట్ల భద్రయ్య, పల్లాటి జైపాల్‌రెడ్డి, కాంట్రాక్టర్ కందుల ప్రభాకర్‌రెడ్డి, ఏఈ సందీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజాక్, సద్ది మల్లారెడ్డి, మహేష్, ప్రతాప్, సూపర్‌వైజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి



నెక్కొండ: విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్, ఉపాధ్యాయులు



రాయపర్తి: బాలాజీ గోశాల ఆధ్వర్యంలో..

నెక్కొండ : మానవాళి మనుగడకు ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని స్థానిక సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి అన్నారు. శివ పార్వతి గోశాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని ఆమె సూచించారు. ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే అనర్థాలను ఆమె విద్యార్థులకు వివరించారు. గోశాల ప్రతినిధి వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలి

రాయపర్తి : ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని రక్షించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం బాలాజీ గోశాల ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించినప్పటికీ కొందరు వ్యాపారస్తులు ఇప్పటికీ అక్రమంగా వాడుతున్నారని, వాటి వల్ల ప్రమాదకరమైన రోగాలు, కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివపురం వీరభద్రశర్మ, మారం రోజారాణి, రోహిణి, కోల దేవేందర్, కైలాసం, ఉమ, శోభ, గోశాల ప్రతినిధులు రాజేష్, లావుడ్యా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రాయపర్తి : ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందించే సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, సర్పంచ్ గారె నర్సయ్య, మంత్రి పీఏ మార్గం సారంగం, బందెల బాలరాజు, ఎంపీటీసీ మూనావత్ వెంకన్న, మార్కెట్ డైరెక్టర్ కుందూరు యాదగిరిరెడ్డి, పోగుల కొండ వేణు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సంగెం : అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షురాలు సత్యవతి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండవ రోజు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్ల పరిష్కరించేవరకు నిరవధిక సమ్మెలో చేస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఓదమ్మ, మమత, విజయ, వినోద, నీరజ, ఆయాలు యాదమ్మ, ముత్తిలింగమ్మ, శిరీష, యశోద పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సన్మానం

నెక్కొండ : మండలంలోని సూరిపల్లి హైస్కూల్‌కు చెందిన పీఈటీ కోట రాంబాబు జాతీయ అవార్డుకు ఎంపికవ్వడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు ఉంగ్రాతి సుజన్‌తేజ అన్నారు. మంగళవారం రాంబాబును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక మంది విద్యార్థులను క్రీడా రంగంలోకి తీసుక వచ్చి రాష్ట్ర, జాతీయ పోటీలకు పంపిన ఘనత రాంబాబుకు దక్కుతుందన్నారు. మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆయన ఆశించారు. ఉపాధ్యాయులు, శ్రీనివాస్, రమేష్, సారంగపాణి, నర్సింగ్‌రావు, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



నెక్కొండ: రాంబాబును సన్మానిస్తున్న టీచర్లు

హుస్సేన్‌పల్లి సర్పంచ్‌కు సన్మానం

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామ పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డు అందుకోవడంతో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రజిత శ్రీనివాస్‌లను పాలకవర్గ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ నెల 10న డీఆర్డీఓ కార్యాలయంలో హుస్సేన్‌పల్లి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదు పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి అవార్డు అందుకున్నారు.

నియామకం



నర్సంపేట : గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నర్సంపేట డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కల్లెపు వెంకట్‌నారాయణగౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం మోకుదెబ్బ డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గౌడ కులస్తులు ఐక్యతతో హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. గౌడల ఐక్యత కోసం పోరాటం చేసిన వెంకట్‌నారాయణగౌడ్ సేవలను గుర్తించి ఉన్నత పదవిని అందించామని అన్నారు. సంఘ అభివృద్ధి కోసం కృషి చేస్తానని వెంకట్ నారాయణగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు రాజేశ్వర్, శీలం వీరన్న, జిల్లా ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు గండి యాదగిరి, గోపగాని శోభన్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ మర్రిపల్లి కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న పార్వతమ్మ

దుగ్గొండి : మండలంలోని మర్రిపల్లి గ్రామంలో మహిళా కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కుక్కముడి కవిత, ఉపాధ్యక్షురాలుగా పొన్నాల రజిత, మాసాని ఏలిషా, ప్రధాన కార్యదర్శిగా పొన్నాల సమత, కార్యదర్శులుగా కుక్కముడి నీల, సిన బోయిన మంజుల, గాజు అహల్య, సహాయ కార్యదర్శిగా అల్లాపురం వసంత, కోశాధికారిగా ఎరుకల పద్మ, కార్యవర్గ సభ్యులుగా రాధారపు సుధ, పులి విజయ, గొర్రె లక్ష్మి, గాజు రజిత, కుక్కముడి కొమురమ్మ ఎన్నికయ్యారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మండల అధ్యక్షురాలు వెండి సక్కుబాయి ఉన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణానికి పాటుపడాలి



ఎన్‌ఎస్‌యూఐలో చేరిన విద్యార్థులతో దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : తెలంగాణ పునర్నిర్మాణములో విద్యార్థులు భాగస్వాములు కావాలని, విద్యార్థుల త్యాగాలతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అఖిల్, నియోజకవర్గ అధ్యక్షుడు బేతి భరత్‌ల ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు దొంతి మాధవరెడ్డి సమక్షంలో (కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం)ఎన్‌ఎస్‌యూఐలో చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాధవరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఆత్మ బలిదానానికి చలించిన యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడ్డ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశాడని అన్నారు. విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణానికి కృషి చేసే దిశగా పని చేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గుణపాఠం చెప్పాలన్నారు. విద్యార్థులు నూతన ఓటరు నమోదుకు కృషి చేసి ప్రజాస్వామ్యబద్ధ మైన ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకునే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు మంద శివ పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి

సంగెం : కేంద్రం అందించే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలన.. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లబెల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుజ్జ సత్యనారాయణరావు, గురుప్రసాద్, భద్రయ్య, సంగెం మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మొలుగురి శ్రీనివాస్, బెజ్జంకి శేషాద్రి, వడ్డీ దేవేందర్‌రెడ్డి, వీరయ్య, వెంకన్న, కొమురయ్య, కొమ్మాలు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లిలో కేంద్ర పథకాలను వివరిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ తదితరులు

ఉద్యోగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు, వీఓఏలు

ఖానాపురం : తెలంగాణలోని ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంపీపీ వేముల పల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం వీఓఏలకు జీతాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలకు ఇచ్చిన హామీలో భాగంగా సీఎం కేసీఆర్ జీతాలు పెంచడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంనర్సయ్య, మండల కో ఆప్షన్ మెంబర్ మస్తాన్, సమాఖ్య అధ్యక్షురాలు కవిత, జ్యోతి, పద్మ, రేణుక, లత, నీరజ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పర్వతగిరి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వరంగల్ ఏఎంసీ మార్కెట్ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం గృహ లక్ష్మి పథకం కింద మంజూరైన 15మంది లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గుపోసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు తశాంశెట్టి రఘు, స్థానిక సర్పంచ్ గటిక సుష్మమహేష్, ఉపసర్పంచ్ ధర్నోజు దేవేందర్, మట్టపల్లి గోపాల్‌రావు, ఎంపీటీసీలు మౌనికరాజు, వాసుసుభాషిణి, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి జీడి ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు దబ్బేట యాలాద్రి, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏకాంతం

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్

నెక్కొండ : సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ చెప్పారు. పథకం ప్రకారమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, ప్రజల నడ్డివిరుస్తున్నారని ఆయన ఆరోపించారు. మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో రమేశ్ పాల్గొని, మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న ఆయా పార్టీలను ప్రజా క్షేత్రంలో నిలదీసే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. కులాలు, మతాల పేరుతో తెలంగాణలో సెంటిమెంట్‌తో మరోసారి ప్రజల్ని మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అక్కపెల్లి రమేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మియాపురం గోవర్ధన్, సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి దామర కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కవిత, నాయకులు యాకయ్య, వెంకటలక్ష్మి, నాగరాజు, రజిత, వీరస్వామి, వీరయ్య, ఐలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నర్సంపేట: చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

నర్సంపేట : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరంరమేష్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అయ్యా దొర నీ బాంచన్ కాల్మొక్తా వెట్టి చాకిరి చేసే ప్రజలను చైతన్య పరిచి ఆయుధ పోరాటం నడిపించిన చరిత్ర సీపీఐదన్నారు. సాయుధ పోరాట కాలంలో లేని బీజేపీ భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లిం పోరాటంగా చిత్రీకరించాలని బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, జిల్లా సమితి సభ్యులు మియాపురం గోవర్ధన్, పాలక కవిత, యాకూబ్, ఇల్లందుల సాంబయ్య, గడ్డం నాగరాజు, వడ్లకొండ స్వామి, చేట్టే మమత, సింగారపు శైలజ, హంస మంజుల, గద్దె రవి, పిట్టల సతీష్, సురేష్, కమ్మల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పునరుద్ధరణ

గీసుకొండ : మండలంలోని ప్రసిద్ధ ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభం, ఇత్తడి తొడుగు, మేఖలంల పునరుద్ధరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ ప్రథమ, ప్రధాన అర్చకులు దివంగత సముద్రాల కృష్ణమాచార్యులు కుమారుడు సముద్రాల సుదర్శనాచార్యులు-భార్గవి దంపతులు రూ. 51 వేలు, వెల్దండి కోటేశ్వర్-శ్వేత దంపతులు రూ.51 వేలు, సరాబు సత్యనారాయణ-సరళాదేవి దంపతులు రూ.25 వేలు, మొలగందుల కృష్ణమూర్తి రూ. 25 వేల సాయం అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పునరుద్ధరణను తిలకించి, మొక్కులు చెల్లించారు.

